

31న డీఎంహెచ్‌వో కార్యాలయంలో వాక్-ఇన్-ఇంటర్వ్యూలు

రంగారెడ్డి అర్బన్, జూలై 27 : మహేశ్వరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీలను భర్తీ చేసేందుకు ఈ నెల 31న వాక్-ఇన్-ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన 11 డీవోలు, 8 ల్యాబ్ అటెండెంట్, 9 ఆఫీస్ సబార్డినేట్, 4 థియేటర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 31 ఉదయం 10 గంటలకు రాజేంద్రనగర్ పరిధిలోని శివరాంపల్లి డీఎంహెచ్‌వో కార్యాయంలో వాక్-ఇన్-ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సీపీఆర్ నిర్వహణపై ప్రతీ ఒక్కరు
అవగాహన కలిగి ఉండాలి

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు



సీపీఆర్‌పై వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ట్రైనర్


రంగారెడ్డి అర్బన్, జూలై 27 : ఆకస్మాత్తుగా గుండెపోటుకు గురైన వారిని ప్రాణాపాయం నుండి కాపాడేందుకు ఎంతగానో ఉపకరించే సీపీఆర్ నిర్వహణ విధానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు సూచించారు. ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లకు సీ.పీ.ఆర్ శిక్షణ ఆవశ్యకతపై శనివారం రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సీపీఆర్-పునర్జన్మ పేరుతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆకస్మికంగా గుండె పోటుకు లోనై ప్రాణాపాయ స్థితికి చేరిన వారికి సీ.పీ.ఆర్ ప్రక్రియను ఎలా అందించాలనే దానిపై శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్‌తో ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. సీపీఆర్ అనే చిన్న ప్రక్రియ ద్వారా ఎంతో విలువైన నిండు ప్రాణాలను కాపాడేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన వారిని గమనించిన వెంటనే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా సీపీఆర్ ప్రక్రియను అమలు చేయాలని సూచించారు. ఆహారపు అలవాట్లు, మారిన జీవనశైలి వంటి అనేక కారణాల వల్ల ప్రస్తుతం అనేకమంది ఆకస్మికంగా గుండెపోటుకు గురవుతున్నారని, అత్యవసర చికిత్స అందక మృతి చెందుతున్నారని తెలిపారు. ఇలాంటి సందర్భాలలో అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన వారికి సరైన విధానంలో సీపీఆర్ చేస్తే, కనీసం 10 మందిలో ఐదుగురు బ్రతికేందుకు అవకాశం ఉంటుందన్నారు. సీ.పీ.ఆర్ టెక్నిక్ తెలుసుకున్న వారు, ఒక్కొక్కరు మరో పది మందికి నేర్పించాలని కోరారు. సమాజంలోని ప్రతి ఒక్కరు సీపీఆర్ గురించి అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని, దీనివల్ల ఆపద సమయంలో తమ కుటుంబ సభ్యులతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడిన వారవుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాకేష్, డాక్టర్ అర్చన, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంపై ఆశలు

- నేడు సొంతగడ్డ కల్వకుర్తికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాక
- కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ
- బీఎస్ఎన్ఎల్ మైదానంలో బహిరంగ సభ
- డీ 82 కాల్వ పూర్తి, భూ నష్ట పరిహారం కోసం ఎదురుచూపులు
- వంద పడకల ఆస్పత్రి, ట్రామా కేర్ సెంటర్ మంజూరుకు విన్నపం

- 7లో -


ప్రారంభానికి సిద్ధమైన జైపాల్‌రెడ్డి విగ్రహం


రామ్మోహన్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే
సబితా ఇంద్రారెడ్డి, మహేశ్వరం ఎమ్మెల్యే

జిల్లాపై రగడ

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా శనివారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో కేంద్ర బిందువుగా నిలిచింది. జిల్లా గురించి చర్చ హాట్‌హాట్‌గా సాగింది. ప్రధానంగా వికారాబాద్ జిల్లా ఏర్పాటు గురించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మధ్య ఆసక్తికర చర్చ సాగింది. తమ ప్రాంతాన్ని మారుమూలకు నెట్టేసి వికారాబాద్ జిల్లాగా ఏర్పాటు చేశారని రామ్మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించగా.. వెనుకబడిన వికారాబాద్ ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలని 30 ఏళ్లుగా ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారని, ఇపుడు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి వికారాబాద్ జిల్లా ఏర్పాటును తప్పుబట్టడం సరికాదని సబితారెడ్డి పేర్కొన్నారు. దీంతో సభలో వాడీవేడి చర్చకు దారితీసింది.

వికారాబాద్ జిల్లా ఏర్పాటుపై వాగ్వాదం.. అసెంబ్లీలో హాట్ హాట్

- రంగారెడ్డి జిల్లాను ఎడారిగా మార్చారు : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి
- శాస్త్రీయంగా జరగలేదన్న ఎమ్మెల్యే టీఆర్ఆర్
- మారుమూలకు నెట్టేశారని ఆవేదన
- స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఇరకాటంలోకి నెట్టిన సబితారెడ్డి
- వికారాబాద్ జిల్లాపై మీ అభిప్రాయమేమిటని ప్రశ్నించిన ఎమ్మెల్యే

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

అసెంబ్లీ సమావేశాల్లో వికారాబాద్ జిల్లా ఏర్పాటుతో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు అంశాలపై శనివారం నేతల మధ్య హాట్‌హాట్‌గా చర్చ జరిగింది. అసెంబ్లీలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా విషయాలను ప్రస్తావించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా భూములను అమ్మేసిందని, కానీ జిల్లాకు సాగునీరు ఇవ్వకుండా ఎడారి ప్రాంతంగా మార్చారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రూ.లక్షల కోట్ల విలువైన రీజినల్ రింగు రోడ్డును రూ.7వేల కోట్లకు అమ్ముకున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పదేళ్లైనా పూర్తి చేయలేదని విమర్శించారు. సభలో ప్రసంగించిన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆవేశానికి లోనై తొడకొట్టారు. చేవెళ్ల-ప్రాణహిత ప్రాజెక్టును పూర్తిగా రద్దు చేశారని దీనివల్ల ఉమ్మడి జిల్లాకు అన్యాయం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా ఏర్పాటుపై ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి. గతంలో తమ ప్రాంతం హైదరాబాద్‌లో కలిసి ఉండేదని.. తరువాత గ్రామీణ ప్రాంతాలను కలిపి రంగారెడ్డి జిల్లాగా ఏర్పాటు చేశారని చెప్పారు. అయితే గత ప్రభుత్వ హయాంలో జరిగిన జిల్లాల పునర్విభజన శాస్త్రీయంగా జరగలేదన్నారు. తమ ప్రాంతాన్ని మారుమూలకు నెట్టేసి వికారాబాద్ జిల్లాగా ఏర్పాటు చేశారన్నారు. తాజాగా విడుదలైన తలసరి ఆదాయంలో రంగారెడ్డి జిల్లా అగ్రస్థానంలో ఉండగా వికారాబాద్ జిల్లా అట్టడుగున ఉందన్నారు. ఈ తారతమ్యాలు తగ్గించాల్సిన అవసరం ఉందని, పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక జిల్లా ఏర్పాటు చేయాలని, 50వేల మంది జనాభాకు ఒక మండలాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ విషయంపై మాజీ మంత్రి సబితారెడ్డి జోక్యం చేసుకోవడంతో చర్చ రసవత్తరంగా మారింది. వెనుకబడిన వికారాబాద్ ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలని 30ఏళ్లుగా ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారని ఇపుడు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి వికారాబాద్ జిల్లా ఏర్పాటును తప్పుబట్టడం సరికాదని సబితారెడ్డి పేర్కొన్నారు. ఈ విషయంలో మీ అభిప్రాయమేమిటనీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను సబితారెడ్డి అడిగి ఇరకాటంలో పెట్టారు. దీంతో మంత్రి శ్రీధర్‌బాబు లేచి స్పీకర్ అందరి వాడని ఆయన అభిప్రాయాన్ని ఎలా కోరతారని సబితారెడ్డిని ప్రశ్నించారు. స్పీకర్ కూడా వికారాబాద్ ప్రాంతానికి చెందిన వారు కావడంతో ఆయన అభిప్రాయం కోరానని, అంతే తప్పా వేరే కాదని చెప్పి ప్రసంగం ముగించారు.



స్థానిక పోరుకు సన్నాహాలు!

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు షురూ

- అగస్టు మొదటి వారంలోగా కొత్త ఓటరు జాబితా
- బీసీ కమిషన్ రిపోర్టు ఆధారంగా నిర్వహణ
- పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు ?
- మూడు విడతల్లో పోలింగ్!
- గ్రామాల్లో నెలకొన్న సందడి

ఆంధ్రజ్యోతి, వికారాబాద్/మేడ్చల్/రంగారెడ్డి అర్బన్, జూలై 27 : త్వరలోనే పంచాయతీ ఎన్నికలకు నగారా మోగనుంది. సెప్టెంబరు లేదా అక్టోబర్‌లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 2తో పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. ఆగస్టు ఒకటి నాటికి ఆరు నెలలు పూర్తవుతుంది. ఆరు నెలలు దాటితే కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రామాలకు రావాల్సిన గ్రాంట్స్ ఆగిపోనుండటంతో ప్రస్తుతం ప్రభుత్వం ఆగమేఘాల మీద పంచాయతీ పోరుకు కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగానే వచ్చే నెల మొదటి వారంలోగా కొత్త ఓటరు జాబితాను పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రస్తుతం పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు లేకుండా గత రిజర్వేషన్ల ప్రకారమే కొనసాగించాలని సర్కారు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

స్థానిక సమరంపై దృష్టి..

ఇప్పటికే శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు విజయవంతంగా ముగిశాయి. ఇక స్థానిక సమరంపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. అదేవిధంగా ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీ కాలం జూలై 3,4 తేదీలతో ముగిసింది. ఫిబ్రవరి నెలలోనే పంచాయతీలకు కొత్త పాలకవర్గాలు కొలువు దీరాల్సి ఉండగా, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు వాయిదా వేశారు. జూలై మొదటి వారంలో జిల్లా, మండల పరిషత్తుల్లో కొత్త పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ పూర్తి కాగానే పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని భావించినా సాధ్యపడలేదు.

బీసీ కమిషన్ రిపోర్టు ఆధారంగా...

పంచాయతీ రిజర్వేషన్లు మారతాయా.. లేక పాత వాటి ప్రకారమే కొనసాగిస్తారా..అనే సందిగ్ధత నెలకొంది. వాస్తవానికి పంచాయతీరాజ్ చట్టం-2018 ప్రకారం ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లనే యథాతథంగా కొనసాగించాలి. కానీ.. కొత్త ప్రభుత్వం చట్ట సవరణ చేస్తే రిజర్వేషన్లు మారవచ్చు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే కార్యదర్శులు వార్డు సభ్యులకు సంబంధించిన రిజర్వేషన్లపై వివరాలు పంపించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పాత రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉంది. మరోపక్క బీసీ గణన తెరపైకి రావడంతో రిజర్వేషన్లు మారతాయనే ప్రచారం జరుగుతోంది. బీసీ కమిషన్ రిపోర్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేయాలని సర్కారు నిర్ణయించింది.

మూడు విడతల్లో ఎన్నికలు?

రంగారెడ్డి జిల్లాలో 27మండలాలు, 558 గ్రామ పంచాయతీలున్నాయి. 2019లో మూడు విడతల్లో గత పంచాయతీ ఎన్నికలను నిర్వహించారు. మొత్తం 505 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో 53 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. వికారాబాద్ జిల్లాలో 566 గ్రామపంచాయతీలు, 4,862 వార్డులు ఉన్నాయి. గత ఎన్నికల్లో జిల్లాలోని పంచాయతీల్లో మెజార్టీ స్థానాలు మహిళలకే రిజర్వు అయ్యాయి. స్థానిక సంస్థల్లో మహిళలకు 50శాతం రిజర్వు చేయడంతో 566 పంచాయతీల్లో సగం మహిళలకు రిజర్వు చేశారు. మేడ్చల్ జిల్లాలో 61 పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి.


ప్రత్యేకాధికారుల పాలనలో పడకేసిన పారిశుధ్యం

జనవరి 31వ తేదీతో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది. అప్పటి నుంచి పంచాయతీల పాలనను ప్రభుత్వం ప్రత్యేకాధికారులకు అప్పగించింది. ప్రత్యేకాధికారులు వారివారి పనుల్లో బిజీగా ఉండడంతో పల్లెల్లో పాలన గాడి తప్పింది. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ లోపించడంతో వర్షాకాలంలో గ్రామాల్లో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రతీ చిన్న పనికి కూడా ప్రత్యేకాధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి వస్తుండటం.. వారు అందుబాటులో లేకపోవడంతో కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు చేతులెత్తేస్తున్నారు.

నిధుల లేమితో కుంటుపడుతున్న అభివృద్ధి

ఇదిలా ఉంటే పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్రం విడుదల చేసే 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. ఎన్నికలు జరిగితేనే నిధులు వచ్చే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఏడాది కాలంగా నిధులు విడుదల చేయలేదు. దీంతో అభివృద్ధి కుంటుపడుతోంది. చేపట్టిన పనులకు బిల్లులు రావడం లేదు. ఇప్పటికే గత పాలకవర్గాలకు భారీగా బకాయిలు చెల్లించాల్సి ఉంది.

సర్పంచ్ పదవులకు పెరుగుతున్న పోటీ



గ్రామాల్లో తాజా మాజీ సర్పంచ్‌లతో పాటు గత ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులు సర్పంచ్ పదవిని దక్కించుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, సంపన్నులు సర్పంచ్ కావాలన్న పట్టుదలతో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పార్టీలో ఆశావహుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. తమకు సర్పంచ్‌గా పోటీచేసే అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే చుట్టూ, ప్రదక్షిణలు చేస్తుండగా, ఇతర పార్టీలకు చెందిన నాయకులు అధిష్ఠానాన్ని కలిసేందుకు యత్నాలు సాగిస్తున్నారు.

తిరుమలేశుడి ఆలయ భూముల్లో
ఫెన్సింగ్, కడీల తొలగింపు

- వారం రోజుల్లో సర్వే చేయిస్తాం
- దేవాదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


ఆలయ భూమిలో ఫెన్సింగ్, కడీలు తొలగిస్తున్న కూలీలు

యాచారం, జూలై 27 : మండల కేంద్రంలోని శ్రీ తిరుమలేషుడి ఆలయ భూముల్లో అక్రమార్కులు పాతిన కడీలు, ఫెన్సింగ్‌ను అధికారులు తొలగించారు. ఆలయ భూమి కబ్జాకు గురైన విషయమై శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ఆలయ భూమే కదా.. ఆక్రమించేద్దాం.! శీర్షికన ప్రచురితమైన కథనంపై ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ అయ్యప్పలు స్పందించారు. తక్షణమే భూమిని పరిశీలించి కబ్జాకు గురైన ప్రాంతాన్ని గుర్తించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. దాంతో ఆర్ఐ రామకృష్ణ, దేవాదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌లు తహసీల్దార్ కార్యాలయంలో ఆలయ భూమికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సర్వే నెంబర్ 42లో 10 ఎకరాల 21గుంటల భూమి ఉందని గుర్తించారు. అయితే, ఆ భూమిలో కడీలు నాటి ఫెన్సింగ్ వేసిన ప్రాంతాన్ని అధికారులు పరిశీలించారు. కూలీలతో కడీలు, ఫెన్సింగ్‌ను తొలగించారు. వారం రోజుల వ్యవధిలో ప్రభుత్వ సర్వేయర్‌తో భూమిని పూర్తిగా సర్వేచేయించి హద్దులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అదేవిధంగా ప్రైవేటు వ్యక్తులు భూమిలోకి రాకుండా తగిన చర్యలు తీసుకుంటామని దేవాదాయ, రెవెన్యూ శాఖల అధికారు లు తెలిపారు. కాగా, గుట్టకు ఆనుకొని ఉన్న భూమిలో కడీలు నాటిన స్థలం కూడా ఆలయానికి చెందినదేనని ప్రధాన అర్చకుడు రాజేష్ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కు విన్న వించారు. ఎవరైనా భూమిని ఆక్రమిస్తే చట్టపరంగా కఠి న చర్యలు తీసుకుంటామని ప్రణీత్ 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు. స్థానికులు ఆలయ భూముల పరిరక్షణకు సహకరించాలని కోరారు. భూమిని సమగ్రంగా సర్వే చేయించి హద్దులు ఏర్పాటుచేస్తామని ఆయన వెల్లడించారు.

ఈ-ఆఫీసు ద్వారా ఫైళ్లు పంపాలి

జిల్లా రెవెన్యూ అధికారి సంగీత


మాట్లాడుతున్న డీఆర్వో సంగీత

రంగారెడ్డి అర్బన్, జూలై 27 : ప్రతీ శాఖలో ఈ-ఆఫీసు ద్వారా కార్యకలాపాలు నిర్వహించాలని, ఇక నుంచి దాని ద్వారానే ఫైళ్లు పంపాలని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత జిల్లా అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో ఈ-ఆఫీసు నిర్వహణపై జిల్లా అధికారులకు, సిబ్బందికి ఎన్ఐసీ సెంటర్ నుండి వర్చువల్‌గా నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. జిల్లా అధికారులందరూ ఫైళ్లన్నీ ఈ-ఆఫీస్ ద్వారా పంపే విధంగా చర్యలు చేపట్టడానికి రాష్ట్ర ఎన్ఐసీ సెంటర్ నుండి జిల్లా అధికారులకు, వివిధ శాఖల అధికారులకు ట్రైనింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఈ ట్రైనింగ్ ద్వారా అవసరమైన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అధికారులందరూ ఏర్పరుచుకోవాలన్నారు. రాబోయే రోజులన్నీ సాంకేతిక పరిజ్ఞానంపైనే ఆధారపడి ఉంటాయని, అందువల్ల ప్రతీ శాఖలో ఈ-ఆఫీసు ద్వారా కార్యకలాపాలు నిర్వహించాలని ఇదివరకే జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశించినట్లు గుర్తు చేశారు. శాఖల వారీగా లాగిన్స్ పెండింగులో లేకుండా త్వరతగతిన చర్యలు తీసుకోవాలన్నారు. ముందస్తు చర్యలు చేపడుతూ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, వ్యవసాయ, మత్స్య, పంచాయతీ, ఉద్యాన, మహిళా శిశు సంక్షేమ శాఖ, మైనారిటీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, పంచాయత్ రాజ్, మెప్మా మొదలైన శాఖల్లో బల్క్ ఈ మెయిల్ ఐడీలను క్రియేట్ చేసుకోవడానికి అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఇప్పటి వరకు ఐడీలు క్రియేట్ కాకుంటే త్వరతగతిన ఏర్పాటు చేసుకోని కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానంలో అధికారులందరూ శిక్షణ తీసుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, శిక్షణ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఢిల్లీలో ధర్నాకు తరలిరండి : ఎమ్మార్పీఎస్

షాద్‌నగర్ అర్బన్, జూలై 27: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి వర్గీకరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 6,7వ తేదీల్లో ఢిల్లీలో నిర్వహించతలపెట్టిన ధర్నా.. చలో ఢిల్లీ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు తరలిరావాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సిర్సనోళ్ళ బాల్‌రాజ్ పిలుపునిచ్చారు. ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. పార్లమెంట్ ఎన్నికల ముందు బీజేపీ ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణను చేపట్టే వరకు ఉద్యమాన్ని కొనసాగించడానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు మోడల్ జూనియర్ కళాశాల విద్యార్థి ఎంపిక


శర్బజిత్‌కు సర్టిఫికెట్ అందిస్తున్న టీచర్లు

చేవెళ్ల, జూలై 27 : మండల కేంద్రంలోని మోడల్ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థి శర్బజిత్ రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ కాంపిటీషన్‌కు ఎంపికయ్యాడు. ఈ మేరకు శనివారం ప్రిన్సిపాల్ టేనావతి మాట్లాడుతూ ఈ నెల 30న హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ నాలెడ్జ్ పోటీలకు శర్బజిత్ ఎంపికయ్యారని చెప్పారు. ఆ పోటీల్లో విజయం సాధిస్తే.. ఆగస్టు 16న జపాన్‌లో జరిగే ఇన్‌స్పైర్ పోటీల్లో శర్బజిత్ పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు.


కాలువ గండిని పూడుస్తున్న హిటాచీ యంత్రం

పిరంగి కాలువకు మరమ్మతులు

శంకర్‌పల్లి, జూలై 27: మండల పరిధిలోని మోకిల గ్రామంలో వరదలతో గండి పడిన పిరంగి కాలువకు నీటి పారుదల శాఖ అధికారులు శనివారం మరమ్మతులు చేపట్టారు. హిటాచీతో గండి పడిన ప్రాంతంలో మట్టితో పూడ్చివేయించారు. ఐదు రోజుల క్రితం వర్షాల కారణంగా వరదలు వచ్చి పిరంగి కాలువకు గండి పడటంతో పంటలన్నీ పాడైన విషయం తెలిసిందే. నీటిపారుదల శాఖ అధికారులు ఆలస్యంగానైనా స్పందించారని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారుల కోసం కాకుండా రైతుల కోసం అధికారులు పనిచేస్తే బాగుంటుందని హితవు పలికారు.





















ప్రభుత్వ నెంబర్-2 పాఠశాలలో టీచర్లతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఉమాహారతి

నాణ్యమైన భోజనం అందించాలి

● అదనపు కలెక్టర్ ఉమాహారతి

తాండూరు రూరల్, జూలై 27 : విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందేలా చూడాలని, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని అదనపు కలెక్టర్ ఉమాహారతి సూచించారు. శనివారం పాఠశాలల రాష్ట్ర పరిశీలన బృందంతో కలిసి తాండూరు, పాత తాండూరులోని ప్రభుత్వ నెంబర్-2 పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి పఠనా సామర్థ్యాలు రాబట్టారు. టీచర్లువిద్యను ఎలా అందిస్తున్నారో తెలుసుకున్నారు. అదేవిధంగా ఉపాధ్యాయుల బోధనపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేలా విద్యనందించాలని సూచించారు. ప్రతీ విద్యార్థి చదువుపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. పాఠశాలకు సొంత స్థలంలో భవనం ఏర్పాటు చేసే విధంగా చూడాలని తెలిపారు. పరిశీలన బృందం ప్రతినిధులు, విద్యాధికారి వెంకటయ్యగౌడ్, హెచ్ఎం ప్రతిభాభారతి తదితరులున్నారు.

సీఎంపై ఆశలు

- నేడు కల్వకుర్తికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ
- బీఎస్ఎన్ఎల్ మైదానంలో బహిరంగ సభ
- డీ-82 కాల్వ పూర్తి, భూ నష్ట పరిహారం మంజూరు కోసం బాధితుల ఎదురుచూపు
- వంద పడకల ఆస్పత్రి, ట్రామా కేర్ సెంటర్ ఇవ్వాలని విన్నపం

ఆమనగల్లు/కల్వకుర్తి, జూలై 27: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సొంత గడ్డ కల్వకుర్తికి నేడు(ఆదివారం) రానున్న సందర్భంగా ఈ ప్రాంత ప్రజలు పలు ఆశలు పెట్టుకున్నారు. కేఎల్ఐ డీ-82 కాల్వతో పాటు సబ్ కెనాల్స్ పూర్తి, పెండింగ్ భూ నష్ట పరిహారం మంజూరుతో పాటు వంద పడకల ఆస్పత్రి మంజూరు చేస్తారని ఆశిస్తున్నారు.

దాదాపు పూర్తయిన కేఎల్ఐ డీ-82 కాల్వ

కల్వకుర్తి ప్రాంతానికి పూర్తి స్థాయిలో సాగు నీరు అందించడానికి కేఎల్ఐని రూపొందించారు. కేఎల్ఐ 29వ ప్యాకేజీలో భాగంగా కల్వకుర్తి మండలం జంగారెడ్డిపల్లి వరకు 160 కిలో మీటర్లు ప్రధాన కాల్వ పూర్తయ్యింది. ఈ కాల్వ మాడ్గుల మండలం నాగిళ్ల వరకు తవ్వాల్సి ఉండగా అక్కడే పనులు ఆగిపోయాయి. అక్కడి నుంచి కాల్వను కొనసాగించేందుకు డీ-82 పేరుతో రూ.179 కోట్లు మంజూరు చేశారు. 59.05 కిలో మీటర్ల ఈ కాల్వను తవ్వాలి. వెల్దండ మండలం చెరుకూరు వద్ద గతంలో టేకు తోట వల్ల ఈ కాల్వ పనులు ఆగిపోగా, ఆ తోటకు పరిహారం చెల్లించి, ఇబ్బందులను తొలగించారు. కాల్వ పనులు 95 శాతం పూర్తయ్యాయి. కానీ ఆమనగల్లు మండలం సింగంపల్లి వద్ద పరిహారం రాకపోవడంతో రైతులు పనులను గతంలో అడ్డుకున్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి రైతులతో శనివారం మాట్లాడి పనులు చేపట్టారు. కేఎల్ఐ డీ-82 కింద మొత్తం 58,789 ఎకరాలకు నీరందించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 28,150 ఎకరాలకు నీరందుతోంది. నాగిళ్ల వరకు కాల్వ పూర్తయితే పూర్తి స్థాయిలో నీరందనుంది.

అందని పరిహారం

కేఎల్ఐ డీ-82లో భాగంగా రూ.80 కోట్ల భూ నష్ట పరిహారం పెండింగ్‌లో ఉంది. 254 ఎకరాలకు గాను రూ.20 కోట్లకు టోకెన్‌ను రైతులకు సిద్ధం చేయగా, అకౌంట్లలో డబ్బులు జమ కావాల్సి ఉంది. కాగా, మరో 300 ఎకరాలకు సంబంధించి సుమారు రూ.60 కోట్లకు ప్రతిపాదనలు పంపినా రాలేదు. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ పరిహారాన్ని మంజూరు చేస్తారని ఆశగా ఎదురు చూస్తున్నారు.



బహిరంగ సభ స్థలం వద్ద ఏర్పాట్లపై ఐజీ, డీఐజీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

వంద పడకల ఆస్పత్రి కోసం విజ్ఞప్తి

మూడు జాతీయ రహదారుల కూడలిగా ఉన్న కల్వకుర్తికి వంద పడకల ఆస్పత్రి మంజూరు చేయాలని సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డిని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా ట్రామా కేర్ సెంటర్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యా పరంగా ఇంజనీరింగ్ కళాశాలతో పాటు పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేస్తారని ఆశిస్తున్నారు. అదే విధంగా ఆమనగల్లులో 50 పడకల ఆస్పత్రి నిర్మించాలని, పాలిటెక్నిక్ కళాశాల పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.

తుక్కుగూడ నుంచి కల్వకుర్తి వరకు ఆరులేన్ల రోడ్డు

హైదరాబాద్ నుంచి శ్రీశైలం వరకు జాతీయ రహదారి మూడు లేన్లు ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నుంచ కల్వకుర్తి వరకు ఆరు లేన్ల రోడ్డును కేంద్రంతో మాట్లాడి మంజూరు చేయించాలని కోరుతున్నారు.

ఏర్పాట్లు పూర్తి

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం కల్వకుర్తికి రానున్నారు. కల్వకుర్తి పట్టణ పరిధిలోని కొట్ర గేటు వద్ద ఏర్పాటు చేసిన కేంద్ర మాజీ మంత్రి, దివంగత సూదిని జైపాల్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. అంతకు ముందు పట్టణంలోని మునిసిపల్ బీఎస్ఎన్ఎల్ మైదానంలో ఏర్పాటు చేసే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. సీఎం రాక సందర్భంగా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. కలెక్టర్ బదావత్ సంతోష్‌తో పాటు మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ, డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

ఫార్మాసిటీ భూముల క్షేత్రస్థాయి పరిశీలన

● టీఎస్ఐఐసీ ఎండీతో కలిసి పరిశీలించిన కలెక్టర్

యాచారం, జూలై 27 : మండలంలోని కుర్మిద్దలో ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను శనివారం కలెక్టర్ శశాంక, టీఎస్ఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డిలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంత వరకు ఎన్ని ఎకరాల భూములను సేకరించారు? ఆ భూముల్లో ఎవరైన సాగు చేస్తున్నారా? వంటి తదితర వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూమిని సమగ్రంగా పరిశీలించి.. పట్టా భూములా? లేదా ప్రభుత్వ భూములా? అని అడిగి తెలుసుకున్నారు. కాగా, అధికారులు ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను పరిశీస్తున్నట్లు తెలుసుకున్న కొంతమంది రైతులు



ఫార్మాసిటీ కోసం సేకరించిన భూమిని పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక, టీఎస్ఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

తమ భూములు తీసుకోవద్దని, ఇక్కడ ఫార్మా కంపెనీలు ఎట్టి పరిస్థితుల్లో ఏర్పాటు చేయెద్దని డిమాండ్ చేశారు. కలెక్టర్‌తో తమ గోడు వెల్లబోసుకునేందుకు వచ్చిన రైతులను పోలీసులు అడ్డుకున్నారు. భూములను నిషేధిత జాబితాలో ఉన్నవని, మా గోడును కలెక్టర్‌కు చెప్పుకుంటామని రైతులు పోలీసులను కోరినా పట్టించుకోలేదు. దాంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు అధికారుల పర్యటనను వీడియో తీయగా పోలీస్ అధికారులు సెల్‌ఫోన్లు లాక్కొని డిలీట్ చేసినట్లు రైతులు తెలిపారు. ఈ విషయమై సీఐతో మాట్లాడడానికి ఫోన్‌చేయగా తీయలేదు. కార్యక్రమంలో టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ శ్రవణ్‌కుమార్, రెవెన్యూ, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లౌకికశక్తులు ఏకం కావాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



వర్ధంతి సభలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ఇబ్రహీంపట్నం, జూలై 27: రాజకీయాల్లో మతోన్మాదం ప్రమాదకరమని, దానికి వ్యతిరేకంగా లౌకికవాద శక్తులంతా ఏకం కావాల్సిన అవసరం ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. కేంద్రంలో బీజేపీ పాలకులు అధికారం కోసం మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నారని, దీనిని నిలువరించాలన్నారు. శనివారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన మాజీ ఎమ్మెల్యే మస్కు. నర్సింహ 4వ వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మత స్వేచ్ఛకు సీపీఎం కట్టుబడి ఉంటుందన్నారు. ఎవరి మతం, సంప్రదాయాలను వారు గౌరవించుకుంటూ కలిసి ఉండాలనేదే తమ అభిమతమన్నారు. ప్రభుత్వంలో, అధికారిక కార్యక్రమాల్లో మతం ఉండరాదన్నారు. విద్యా రంగంలోకి మతాన్ని తీసుకురావద్దన్నారు. రాజ్యాంగాన్ని మార్చే కుట్రలను సహించేది లేదన్నారు. పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలకోసం మస్కు. నర్సింహ రాజీలేని పోరాటాలు చేశారని గుర్తు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కె.భాస్కర్ మాట్లాడుతూ నర్సింహ హయాంలోనే అనేక మంది పేదలకు ఇళ్ల స్థలాలు, భూములు పంచారన్నారు. సీపీఎంను సంస్థాగతంగా బలోపేతం చేస్తూ ప్రజా పోరాటాలను ముందుకు తీసుకుపోదామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ, మండల కార్యదర్శి సీ.హెచ్.జంగయ్య, పి.యాదయ్య, బి.సామేల్, బి.మధుసూదన్‌రెడ్డి, డి.జగదీశ్, కవిత, మస్కు అరుణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి



మేడ్చల్ టౌన్/మేడ్చల్ : మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ డాక్టర్ శ్రీనివాసులు, సీపీఆర్ చేసి చూపిస్తున్న అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

మేడ్చల్ టౌన్, జూలై 27 : గుండె పోటుతో ఊపిరి ఆగిపోయిన వారికి పునర్జన్మ ప్రసాదించటానికి సీపీఆర్ పద్ధతి ఎంతగానో ఉపయోగ పడుతుందని, దీనిపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ, రాష్ట్ర ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ వర్ధంతిని పురస్కరించుకుని మేడ్చల్‌లోని ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ ప్రధాన కార్యాలయంలో శనివారం సీపీఆర్‌పై 108 సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ సీపీఆర్ పట్ల ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, ప్రజా జీవితంలో అకస్మాత్తుగా కొందరికి గుండెపోటు వచ్చి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, అలాంటి వారికి సీపీఆర్‌తో ప్రథమ చికిత్స అందజేస్తే ప్రాణా పాయ స్థితినుంచి బయట పడుతారన్నారు. అత్యవసర వైద్య సేవలు అందించే 108 సిబ్బంది, ఇతర శాఖల అధికారులు సీపీఆర్ పట్ల తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం 500 మందికి సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్నామన్నారు. ఎన్‌హెచ్ఎం డైరెక్టర్ డాక్టర్ పృథ్వీ, ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశం, ఈఎంఆర్ఐ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రమణ, తెలంగాణ 108 రాష్ట్ర కార్యనిర్వాహణ అధికారి ఎంఏ ఖలీద్, మేడ్చల్, హైదరాబాద్ ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ జాన్ షాహిద్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో పునర్జన్మ: అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

మేడ్చల్, జూలై 27(ఆంధ్రజ్యోతి) : సీపీఆర్ మనిషికి పునర్జన్మ వంటిదని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు(స్థానిక సంస్థలు) కలెక్టర్ రాధికా గుప్తా అన్నారు. నేషనల్ కార్డియో పల్మనరీ రిససిటేషన్(సీపీఆర్) అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మేడ్చల్ కలెక్టరేట్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాధిక పాల్గొని మాట్లాడారు. సీపీఆర్ అవగాహన దినోత్సవం డాక్టర్ అబ్దుల్ కలాం జ్ఞాపకార్థం జూలై 27న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీఆర్ ప్రాముఖ్యత, సాంకేతికలపై అవగాహన కల్పించారు. డీఎంహెచ్‌వో రఘునాథస్వామి, ప్రోగ్రాం అధికారులున్నారు. కాగా, అదనపు కలెక్టర్ రాధికా గుప్తా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి అభినందనలు తెలియజేశారు.

పది నెలల శిశువుకు అరుదైన వ్యాధి

- ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసిన తల్లిదండ్రులు
- చికిత్స కోసం స్పందించిన సీఎం కార్యాలయం



చిన్నారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంపీ

ఇబ్రహీంపట్నం, జూలై 27: అత్యంత అరుదైన వ్యాధితో బాధపడుతున్న పాపకు వైద్య సాయాన్ని అందిస్తామని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పాప తల్లిదండ్రులకు భరోసా ఇవ్వగా ఆ వెంటనే సీఎం కార్యాలయం స్పందించింది. వివరాల్లోకి వెళ్తే.. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పొల్కంపల్లికి చెందిన పొన్నాల రాజశేఖర్-తేజశ్రీ దంపతులకు పది నెలల పాప ఆరాధ్య గాచర్ డిసీజ్(లైసోమల్ స్టోరేజ్ డిజార్డర్)తో బాధపడుతోంది. చిన్నారికి బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు సుమారు రూ.20-25లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. ఆటో నడుపుకుంటూ జీవనం సాగించే వారికి వైద్య ఖర్చులు భరించడం స్థోమత లేక పీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డిని సంప్రదించారు. ఆయన శనివారం భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసి విషయం వివరించారు. ఎంపీ వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి సహాయ కార్యదర్శి సంగీత సత్యనారాయణతో ఫోన్‌లో మాట్లాడారు. ఆ పాపకు వైద్యం చేయించే బాధ్యత తనదని కూడా ఎంపీ భరోసా చెప్పారు. కాగా అదే సాయంత్రం సీఎంవో కార్యాలయం నుంచి పాప తండ్రి రాజశేఖర్‌కు ఫోన్ కాల్ వచ్చింది. పూర్తి సమాచారాన్ని తెలుసుకున్న అధికారులు లక్డీకాపూల్ సీఎన్‌జే ఆసుపత్రిలో సోమవారం పాపను చేర్చాలని తెలిపారని రాజశేఖర్ చెప్పారు.

వికారాబాద్‌లో చార్మినార్ సర్కిల్
అటవీ సంరక్షణాధికారి పర్యటన



మిట్టకోడూర్ ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న అటవీ సంరక్షణాధికారి రాంబాబు

వికారాబాద్, జూలై 27: చార్మినార్ సర్కిల్ అటవీ సంరక్షణాధికారి ఎస్.రాంబాబు శనివారం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా 2024 సంవత్సరానికి సంబంధించిన ప్లాంటేషన్‌ను పరిశీలించారు. జిల్లాలోని మిట్టకోడూర్, జాఫర్‌పల్లిలో జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. తిప్పాపూర్ రిజర్వు ఫారెస్ట్‌లోని 20 హెక్టార్ల ఎస్ఎంఎం ప్లాంటేషన్, మిట్టకోడూరులోని 10 హెక్టార్ల ఎస్ఎంఎం ప్లాంటేషన్, జాఫర్‌పల్లి అర్బన్ ఫారెస్ట్ పార్కును తనిఖీ చేశారు. అనంతరం వికారాబాద్ ఫారెస్ట్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారి శ్యామ్‌కుమార్, పరిగి రేంజ్ అధికారి ఎండీ అబ్దుల్‌హై, సంబంధిత సెక్షన్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా మార్పు

బషీరాబాద్, జూలై 27: ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతోనే బషీరాబాద్ పీహెచ్‌సీని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)గా మార్పు చేసినట్లు ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, సొసైటీ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్ తెలిపారు. స్థానిక సీహెచ్‌సీని శనివారం వారు పార్టీ శ్రేణులతో కలిసి సందర్శించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి పరామర్శించారు. ఆస్పత్రి స్థాయి పెంపుపై వారితో కలిసి ఆనందం పంచుకున్నారు. అక్కడున్న వైద్యుడు శ్రీకాంత్‌తో ఎంత మంది కొత్తగా స్టాఫ్ వచ్చారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా ముగ్గురు వైద్యులు నియమించగా, ఒక హెడ్ నర్సు, 12 మంది స్టాఫ్ నర్సులు ఇప్పటికే విధుల్లో చేరారని వైద్యుడు వివరించారు. సీహెచ్‌సీ నూతన భవనం నిర్మాణ విషయమై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలు అందించాలని వైద్య సిబ్బందిని కోరారు. వారివెంట ఏఎంసీ మెంబర్ అనూప్, కాంగ్రెస్ నాయకుడు రియాజ్, యువకులు పలువురు పాల్గొన్నారు.



బషీరాబాద్ సీహెచ్‌సీలో రోగితో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ మాధవరెడ్డి, అజయ్‌ప్రసాద్

నేవీరాడార్ అటవీ ప్రాంతాన్ని సందర్శించిన ఎస్పీ, అదనపు కలెక్టర్

పూడూరు, జూలై 27: మండలం మండలం దామగుండం అటవీ ప్రాంతాన్ని నేవీ, అటవీశాఖ అధికారులతో కలిసి ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో వసుచంద్ర, పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డిలు శనివారం సందర్శించారు. అక్కడ ఏర్పాట్లు, కార్యకలాపాలను పరిశీలించారు. కాగా, నేడు(శనివారం) జరగాల్సిన శంకుస్థాపన కార్యక్రమం నిలిచిపోయింది. దాంతో అధికారులు మళ్లీ నేవీ రాడార్ ప్రారంభోత్సవానికి కావాల్సిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటయ్యే కార్యాలయాలకు కావాల్సిన స్థలాన్ని పరిశీలించారు. అక్కడ చెట్లను కాపాడుకుంటూ కార్యాలయాలను నిర్మించే విధంగా స్థలాలను పరిశీలించారు. వారితో చెన్‌గోముల్ ఎస్సై మధుసూదన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నర్సింహారెడ్డి, సర్వేయర్ సుధాకర్ తదితరులు ఉన్నారు.

తెరుచుకున్న బషీరాబాద్ ఠాణా ప్రధాన ద్వారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బషీరాబాద్, జూలై 27: 'బషీరాబాద్ ఠాణాకు వాస్తు దోషమట!!' అనే శీర్షికన శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై పోలీస్ ఉన్నతాధికారులు స్పందించారు. ఈ విషయమై స్థానిక ఎస్సైని ఆరా తీసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఠాణా ప్రధాన ద్వారం తలుపులు శనివారం తెరుచుకున్నాయి. ఈ క్రమంలో బషీరాబాద్ ఎస్సై రమేష్‌కుమార్ స్పందిస్తూ పోలీస్‌స్టేషన్‌లో చిన్న, చిన్న మరమ్మతు పనులు జరగుతుండటంతో ప్రధాన ద్వారం మూసి పక్కన ఉన్న డోర్ తెరిచామని తెలిపారు. అయితే, ప్రధాన ద్వారం ఎదుట స్థలం అంతగా లేక వాహనాలు పార్కింగ్‌తో తిరగలేని పరిస్థితి ఉందన్నారు. ఇక్కడే రిసెప్షన్ ఏర్పాటుతో కూడా రాకపోకలకు ఇబ్బందిగా ఉండటం పట్ల రెండో డోర్ ఎదుట ఖాళీ స్థలం అనుకూలంగా ఉండటంతో కొంత మార్పులు చేశామంటూ ఎస్సై చెప్పుకొచ్చారు.



తెరుచుకున్న ప్రధాన ద్వారం తలుపులు

నియోజకవర్గ కేంద్రాల్లో అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్లు

- ఆగస్టులో ప్రారంభించేందుకు చర్యలు
- ముందుగా తాండూరులో ప్రారంభానికి ఏర్పాట్లు

తాండూరు, జూలై 27 : నియోజకవర్గ కేంద్రాల్లో అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. వారంలోగా కేంద్రాలను ప్రారంభించేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, కలెక్టర్ ఆదేశానుసారంగా వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో ముందుగా అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు తాండూరు మున్సిపాలిటీ పరిధిలో సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు అవసరమైన భవనాన్ని పరిశీలిస్తున్నారు. పాత మున్సిపాలిటీలో ప్రైవేట్ లైబ్రరీతో పాటు సెంటర్ ఏర్పాటుకు అనువైన భవనం కోసం పరిశీలించారు. తాండూరుతో పాటు కొడంగల్, పరిగి, వికారాబాద్‌లో సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు.

యువతకు ఎంతో ప్రయోజనం

నాలెడ్జ్ సెంటర్‌లో నిపుణులతో ఉచితంగా కోచింగ్ ఇప్పిస్తారు. యువతకు శిక్షణ అందించడంతో పాటు పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను కూడా సెంటర్లలో ఏర్పాటు చేయనున్నారు. వందలాది మంది నిరుద్యోగులు బీటెక్, ఎంటెక్, ఐటీఐ వంటి కోర్సులు పూర్తి చేసినా తగిన స్కిల్స్ లేక గ్రామాల్లోనే ఉండిపోతున్నారు. గ్రంథాలయాల్లో ఆధునిక శాస్త్ర, సాంకేతిక విద్యకు సంబంధించిన పుస్తకాలు లేకపోవడంతో యువకులకు వాటిని కొనుగోలు చేసేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

తాండూరు డివిజన్‌కు రెండు సెంటర్లు

తాండూరు డివిజన్ తాండూరుతో పాటు కొడంగల్‌లో సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. వారంలోగా ఈ కేంద్రాలను ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే వారంలో మంత్రుల చేతుల మీదుగా సెంటర్లను ప్రారంభించే అవకాశాలున్నాయి.

వ్యవసాయ శాఖలో బదిలీలకు బ్రేక్

● రుణమాఫీ ప్రక్రియ ముగిసిన తర్వాతే..

తాండూరు రూరల్, జూలై 27: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా అన్ని శాఖల్లో బదిలీల పరంపర కొనసాగిస్తోంది. అన్ని శాఖల్లో ఉద్యోగుల బదిలీలు ఉన్న వ్యవసాయ శాఖలో బదిలీలు మాత్రం తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రైతు రుణమాఫీకి సంబంధించి రైతుల్లో ఉన్న సందేహాలు నివృత్తిని చేసి పరిష్కరించడంలో వ్యవసాయశాఖ అధికారులు కీలంగా మారారు. ఇప్పటికే రూ.లక్ష రుణమాఫీ చేసిన ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీ లోపు రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయనుంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖలో తాత్కాలికంగా బదిలీలు నిలిపివేసినట్లు తెలుస్తోంది. తాండూరు వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో ఏడీ, ఐదుగురు ఏవోలు, 24 మంది ఏఈవోలు ఉన్నారు. కాగా, వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఇప్పటికే వీరందరి వివరాలు సేకరించింది. పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖల్లో ఇప్పటికే బదిలీలు పూర్తయ్యాయి. అయితే, రుణమాఫీ ప్రక్రియ ముగిసిన తర్వాత బదిలీలు అయ్యే అవకాశం ఉందని ఏడీఏ రుద్రమూర్తి ఈ సందర్భంగా ఒక ప్రకటనలో తెలిపారు.

అంటువ్యాధులు, పరిశుభ్రతపై
జానపద గేయాలతో అవగాహన

కందుకూరు, జూలై 27: వానాకాలంలో ప్రబలే వ్యాధుపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా స్థాయి సాంస్కృతిక సారథి బృందం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. శనివారం మండలంలోని దెబ్బడగూడలో రెండు గంటల పాటు ప్రధాన వీధుల్లో కళాకారులు జానపద గేయాలతో పరిసరాలను పరిశుభ్రతపై ప్రజలను చైతన్యం చేశారు. కళాకారులు అనిల్, ఎల్.శ్రీనివాస్, ఈశ్వర్, సంతోష్, సత్యవాణి, కరుణ, అపూర్వ, తదితరులు పాల్గొన్నారు.



దెబ్బడగూడలో జానపద గేయాలతో ప్రజలను చైతన్యపరుస్తున్న కళాకారులు

'ఉపాధి హామీ' పెండింగ్ బిల్లులు చెల్లించాలి

● తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కాంతయ్య

చేవెళ్ల, జూలై 27 : ఉపాధిహామీ పథకానికి సంబంధించిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో అంబేడ్కర్ భవన్‌లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం టీకేఎంయూ రంగారెడ్డి జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్యతో కలిసి కాంతయ్య హాజరయ్యారు వారు మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం పట్ల కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, ఎన్నికల ముందు ప్రతీవారం ఉపాధి డబ్బులు కూలీల బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం.. తర్వాత డబ్బులు జమ చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రం ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్య పరుస్తూ.. తగిన నిధులు కేటాయించకపోగా పథకాన్ని ఎత్తివేసే దిశలో ఆలోచన చేస్తుందన్నారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ రేపు తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమానికి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి, ప్రభులింగం, జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య, సీపీఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, జంగయ్య, నర్సింహ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మంజుల, ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు శివ, నాయకులు ఆనందం, నర్సింలు, స్వరూప, కృష్ణ య్య, చంద్రయ్య, సురేశ్, గాలయ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ఏర్పాటుకు కృషి


నేదునూరు ఆదర్శ పాఠశాల విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

కందుకూరు జూలై 27: నేదునూరులో ఇంటర్నేషనల్ సైనిక్ స్కూల్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్టు మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఆదర్శ పాఠశాలను తనిఖీచేసి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ పాఠశాల పక్కనే ఉన్న 9 సర్వే నంబర్‌లోని లావణి పట్టా భూమిని పరిశీలించారు. ఇక్కడ ఇంటర్నేషనల్ సైనిక్ స్కూల్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. పాఠశాల వరకు ఉన్న మట్టి రోడ్డు నీలు నిలుస్తోందని, గుంతలు పడ్డాయని విద్యార్థులు లక్ష్మారెడ్డికి చెప్పారు. తన సొంత నిధులతో మొరం పోయిస్తానని కేఎల్లార్ హామీ ఇచ్చారు. అలాగే మునగాల మల్లారెడ్డి వ్యవయక్షేత్రం నుంచి మాన్యగూడ, ఆదిమైసమ్మ ఆలయం మీదుగా మద్దెల కుంటతండా వరకు బీటీ రోడ్డు వేయించేలా హెచ్ఎండీఏ నిధులు మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, మాజీ వైఎస్ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అఫ్జల్ బేగ్, పాండురంగారెడ్డి, పి.యాదిరెడ్డి, కె.రూప్‌చందర్, బి.సురేష్, జి.సురేందర్‌రెడ్డి, మాధవరెడ్డి,ఎస్ జగన్, ఎగ్గిడి కృష్ణ, వి.బాబు, రాములుగౌడ్, రాకేష్ గౌడ్, ఎం.రాములు. హనుమంత్, ప్రవీణ్‌రెడ్డి, ఆరోగ్యరెడ్డి, నాగరాజు, శ్రీశైలం, రవి పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి పనిచేస్తే గుర్తింపు

కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి పనిచేసిన ప్రతీ కార్యకర్త, నాయకుడిని తగిన గుర్తింపు ఉంటుందని కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. కందుకూరులోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్న వారికి తగిన పదవులు ఇచ్చి గౌరవిస్తామన్నారు. కొత్తగా పార్టీలోకి వచ్చే వారికి తగిన ప్రాధాన్యం ఇవ్వకూడదన్న పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు తాను పని చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్ష పదవి కోసం చర్చించగా 10 మంది పోటీపడ్డారు. వారి పేర్లను లక్ష్మారెడ్డి పరిశీలించి, త్వరలో అధ్యక్షుడిని ఎన్నుకోనున్నట్లు తెలిపారు.

ఆలూర్‌కు రాత్రి పూట నడిచిన బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

చేవెళ్ల, జూలై 27 : మండల పరిధి ఆలూర్‌కు రాత్రి పూట ఆర్టీసీ బస్సు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆలూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోపులరాం అశోక్ ఆర్టీసీ అధికారులను కోరారు. శనివారం గ్రామస్తులతో కలిసి ఆయన నగరంలోని మెహదీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ మూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలూర్-దుద్దాగు గ్రామాలకు గతంలో రాత్రి పూట ఆర్టీసీ బస్ సౌకర్యం ఉండేదన్నారు. అయితే అధికారులు ఎలాంటి కారాణాలు చెప్పకుండానే రాత్రి వచ్చే బస్సు సర్వీసును బంద్ చేశారని తెలిపారు. దీంతో రైతులు, ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఆర్టీసీ అధికారులు స్పందించి రాత్రి వచ్చే బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరారు. డీఎంను కలిసిన వారిలో ఆలూర్ గ్రామస్తులు మోహన్, బీమాయ్య, శ్రీనివాస్, బాల్‌రాజ్, విజయ, నలీం తదితరులు ఉన్నారు.


ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఆలూర్ గ్రామస్తులు

ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి


ఉన్నత పాఠశాలలో సభ్యత్వాన్ని అందజేస్తున్న గోవర్ధన్‌యాదవ్

కొందుర్గు, జూలై 27: ఉపాధ్యాయుల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్ అన్నారు. శనివారం కొందుర్గులోని ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదును నిర్వహించారు. గోవర్ధన్‌యాదవ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు 50శాతం పీఆర్సీ ఫిట్మెంట్‌ను ప్రకటించాలని, బీఈడీ కలిగిన వారికి పీఎస్ హెచ్‌ంల పోస్టులు ఇవ్వాలని, ఐదు పెండింగ్ డీఏలను వెంటనే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ మండలాధ్యక్షు లు శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్, నర్సింలు, నాజర్ అలీ, రాంరెడ్డి, జంగయ్య, బాల్‌రాజ్, వెంకట్రావు పాల్గొన్నారు.

చౌదరిగూడ: చౌదరిగూడ, ఇంద్రానగర్, ఎది, పెద్దఎల్కిచర్ల, ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, చౌదరిగూడ కేజీబీవీలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు నిర్వహించారు. పీఆర్‌టీయూ మండలాధ్యక్షులు నర్సింలు, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్, పలువురు టీచర్లు పాల్గొన్నారు.

అట్టహాసంగా పౌరాణిక నాటక పోటీలు


పౌరాణిక నాటక ప్రదర్శనలో కళాకారులు

షాద్‌నగర్ అర్బన్, జూలై 27: షాద్‌నగర్‌లో పౌరాణిక నాటక పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. భాషా సంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శ్రీవాణి సాంస్కృతిక సంస్థ నాటక పోటీలను నిర్వహిస్తోంది. గణేష్ ఫంక్షన్ హాలులో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ పోటీలను ప్రారంభించారు. మొదటి రోజు 11 కళాబృందాలు పౌరాణిక నాటకాలను ప్రదర్శించారు. కార్యక్రమానికి హాజరైన శ్రీవాణి సాంస్కృతిక సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు బండారి రమేష్ మాట్లాడుతూ పౌరాణిక నాటికలను నేటి త రానికి భవిష్యత్తు తరాలకు అందించేలా కళాకారులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడు మహేందర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పి.వెంకట్‌రాంరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ వై.యాదయ్య, నాటక విభాగం రాష్ట్ర సహకార్యదర్శి జి.యాదగిరిచారి, సాంస్కృతిక సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ, కోశాధికారి ఎస్.గోపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

యాచారం, జూలై 27 : కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శనివారం గునగల్‌లోని పాఠశాల విద్యార్థులకు ట్రాన్స్‌కో ఏఈ సందీప్‌కుమార్ మానవతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాగులు, పెన్నులు పంపిణీ చేశారు. విద్యార్థులకు చేయూత నివ్వాలని ట్రాన్స్‌కో అధికారులు అన్నారు. ఏడీ సైదులు, మల్లారెడ్డి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు భారీ ఏర్పాట్లు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జూలై 27: కల్వకుర్తి నియోజకవర్గంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి సభ విజయవంతానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి కోరారు. సీఎం పర్యటనకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఆమనగల్లులో శనివారం సీఎం సభ విజయవంతంపై కాంగ్రెస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సభ విజయవంతంపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాల నుంచి 12వేల మంది జన సమీకరణ చేస్తున్నట్లు తెలిపారు. నేటి సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి కొత్త గేటుకు చేరుకొని కేంద్ర మాజీమంత్రి జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణానంతరం కల్వకుర్తి బహిరంగ సభలో ప్రసంగిస్తారని ఎమ్మెల్యే చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైఎస్ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు జి.కేశవులు, ఎం.రాములు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజశేఖర్, జిల్లా కార్యదర్శి కృష్ణనాయక్, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి ఫరీద్, నాయకులు కాలె మల్లయ్య, యాదయ్య, ఖాదర్ ఖాద్రీ, గండికోట మల్లేశ్, శ్రీను నాయక్, మహేశ్, షర్ఫోద్దీన్, శ్రీను, మల్లేశ్ పాల్గొన్నారు. సీఎం సభను విజయవంతం చేయాలని గుర్రం కేశవులు, ఎగిరిశెట్టి సత్యం కోరారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ఆదిభట్ల ఎస్సై రాజు

ఆదిభట్ల, జూలై 27: సైబర్ నేరస్థులు రోజుకో కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారని, వారి ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదిభట్ల ఎస్సై రాజు సూచించారు. నాదర్‌గుల్ శ్రీ వంశీధర్ స్కూల్ సిబ్బందికి శనివారం సైబర్ క్రైమ్, డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలకు ఎలా గురవుతారు.. వాటి బారిన పడకుండా ఎలా ఉండాలో వివరించారు. లాటరీ తగిలిందనో, లోన్ వచ్చిందనో ఫోన్లకు లింక్‌లు పంపుతారని, అలాంటివి ఓపెన్ చేయొద్దని, ఓటీపీలు చెప్పొవద్దని సూచించారు. సైబర్ మోసాలపై 1930కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూలు సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం


బక్కని నర్సింహులుకు విరాళం ఇస్తున్న సురేందర్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, జూలై 27: షాద్‌నగర్ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయాభివృద్ధికి ఎలికట్టకు చెందిన బెంది రాంరెడ్డి జ్ఞాపకార్థం ఆయన తనయులు సుదర్శన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి 1.01లక్షల విరాళం ఇచ్చారు. శనివారం వేంకటేశ్వరస్వామిని దర్శించుకొని ఆలయ అభివృద్ధిని పర్యవేక్షిస్తున్న మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులుకు ఈ విరాళాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా బెంది సోదరులను ప్రధాన పూజారి శ్రీనివాసచార్యులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి పర్యవేక్షకులు ఒగ్గు కిషోర్, కానుగు రాంభూపాల్, లింగారం కుమార్‌గౌడ్, కె.మురళీమోహన్, అన్మారి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ మైండ్స్‌లో బోనాల సంబరాలు


బోనాల ఉత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, టీచర్లు

ఇబ్రహీంపట్నం, జూలై 27: బొంగులూరులోని మాస్టర్ మైండ్స్ స్కూల్లో శనివారం బోనాల సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు బోనాల ఊపేగింపులో పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు నెలవు అని పాఠశాల ప్రిన్సిపాల్ మొద్దు సుష్మారెడ్డి అన్నారు. విద్యార్థులు చదువులతోపాటు నైపుణ్యం పెంచుకుంటేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో టీచర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయుడికి పల్లకీ సేవ



షాద్‌నగర్ అర్బన్, జూలై 27: షాద్‌నగర్‌లోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం స్వామి పల్లకీసేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కౌన్సిలర్ పులిమామిడి లతశ్రీ శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేసి, స్వామి విగ్రహాన్ని పల్లకీలో పెట్టి భజన పాటలు పాడుతూ సేవను నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారులు భక్తులకు తీర్థప్రసాదం ఇచ్చి, అన్నదానం నిర్వహించారు.

అబ్దుల్ కలాం గురించి ప్రతీ విద్యార్థి తెలుసుకోవాలి


మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పిస్తున్న మహేందర్, టీచర్లు

కందుకూరు, జూలై 27: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే. అబ్దుల్ కలాం జీవిత చరిత్రను ప్రతీ విద్యార్థి తెలుసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు ఊటు మహేందర్ అన్నారు. శనివారం నేదునూరులోని సెయింట్ జోసెఫ్ స్కూల్ ప్రిన్సిపాల్ శాంతిప్రియ, ట్రైనర్ గుండాల సురేష్‌లతో కలిసి ఆ పాఠశాలలో అబ్దుల్‌కలాం 9వ వర్ధంతిని నిర్వహించారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన ఆయన అణు శాస్త్రవేత్తగా ఎదిగారన్నారు. అనంతరం రాష్ట్రపతిగా దేశానికి సేవలందించిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నవీన్, మధు, ప్రసాద్, అరుణ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు మంచి అలవాట్లు నేర్పించాలి


చిన్నారుల తల్లులతో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ దివ్య

కేశంపేట, జూలై 27 : అంగన్‌వాడీ చిన్నారులకు తల్లితండ్రులు మంచి అలవాట్లు నేర్పించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దివ్య సూచించారు. ఇప్పలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిన్నారుల తల్లులతో సమావేశం నిర్వహించారు. దివ్య మాట్లాడుతూ అంగన్‌వాడీ చిన్నారులకు మంచి అలవాట్లతో పాటు, మంచి మాటలు నేర్పించాలని సూచించారు. చిన్నారులకు ఆట, పాటలు, అబినయంతో కథలు, పద్యాలు, ఇంగ్లీష్ పద్యాలు అబినయంతో నేర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేష్, టీచర్ జయమ్మ పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సత్కారం

ఆమనగల్లు, జూలై 27: బదిలీలు, పదోన్నతులతో వేరే స్కూళ్లకు వెళ్తున్న హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు ఆమనగల్లులో శనివారం వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎంఈవో సర్దార్‌నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని టీచర్లను సత్కరించారు. సభలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎక్కడ పనిచేసినా సమయ పాలన తప్పక పాటించాలన్నారు. పనిచేసిన చోటల్లా విద్యార్థులకు ఉత్తమ బోధన చేస్తే వారిని చిరస్థాయిగా గుర్తుంచుకుంటారన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి పాండు, కడ్తాల్ నోడల్ అధికారి జంగయ్య, తలకొండపల్లి జీహెచ్‌హెచ్ఎం రామనాథం, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు రామలక్ష్మి, శ్రీనివాసులు, పూజారి సుదర్శన్, ఆంజనేయులు, పాండు, లక్ష్మీనారాయణ, సుదర్శన్ రెడ్డి, అశోక్‌రెడ్డి, మణిపాల్‌రెడ్డి, మండల పరిధి టీచర్లు పాల్గొన్నారు.


బదిలీ అయిన టీచర్లను సన్మానిస్తున్న ఎంఈవో, నాయకులు

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి


మొక్కలు నాటుతున్న అధికారులు, ఉపాధ్యాయులు

షాబాద్, జూలై 27: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పరిరక్షించాలని పరిరక్షించాలని ఎంపీడీవో అపర్ణ అన్నారు. శనివారం షాబాద్ లోని బాలికల పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని, ఇందుకు మొక్కల పెంపకం ఎంతో అవసరమని ఆమె అన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో ఏపీవో వీరాజింగ్, హెచ్ఎం యామిని, పంచాయితీ కార్యదర్శి అనిత పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు చెల్లించాలి


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

మాడ్గుల, జూలై 27: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.7వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రాష్ట్రప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతగోని శివకృష్ణ డిమాండ్ చేశారు. మాడ్గులలోని ప్రభుత్వ జూనియర్ కాలేజి నుంచి పంచాయతీ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందన్నారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేసి ఫీజు దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు దండు కార్తీక్, గణేష్, పవన్, శివ, మణికంఠ, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు పర్వతాలు

కొత్తూర్, జూలై 27: ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు అన్నారు. శనివారం మునిపల్ పారిశుధ్య కార్మికుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్మికులకు ముఖ గుర్తింపు హాజరును రద్దు చేయాలన్నారు. పట్టణ విస్తరణకు తగ్గట్లుగా కార్మికుల సంఖ్యనూ పెంచాలన్నారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించడం లేదని అవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు షకీల్, ఎల్లయ్య, సంజీవ, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పనితీరుపైనే పాఠశాలల మనుగడ

కడ్తాల్, జూలై 27 : ఆదర్శ సమాజ నిర్మాణానికి గురువే మార్గదర్శి అని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. ఉపాధ్యాయుల పనితీరుపైనే ప్రభుత్వ పాఠశాలల మనుగడ, విద్యాభివృద్ధి ఆధారపడి ఉందన్నారు. కడ్తాలలోని జెడ్పీ బాలికల పాఠశాల హెచ్ఎం అరుణ, టీచర్లు సుగుణాదేవి, మాలతి, భాగ్యరేఖ, రేణుక, స్నేహలత, అలివేలు, సుజాత, జయంతి, రమాదేవి బదిలీపై వెళ్తున్నారు. శనివారం పాఠశాల ఆవరణలో వారికి వీడ్కోలు సన్మానం నిర్వహించారు. లక్ష్మీనర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయినులను శాలువాలతో సత్కరించి, వారి సేవలను కొనియాడారు.

కల్వకుర్తి అభివృద్ధికి సీఎం తోడ్పాటు అందించాలి


విలేకరులతో మాట్లాడుతున్న దశరథనాయక్

కడ్తాల్, జూలై 27: ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి కల్వకుర్తికి వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ కోరారు. కడ్తాలలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. నగరానికి చేరువలోనే ఉన్నా ప్రాంత వెనుకబడే ఉందన్నారు. సీఎం ఈ ప్రాంత వాసి కావడంతో ఆయన నిధులిస్తారని ప్రజలు ఆశతో ఉన్నారన్నారు. కేఎల్ఐ డీ82 పూర్తిచేసి ఆయకట్టుకు నీరివ్వాలని కోరారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిని ఆరు లేన్లుగా విస్తరించేలా కేంద్రం నుంచి నిధులు తేవాలన్నారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరులక్ష్మీనర్సింహారెడ్డి, జిల్లా రైతు సమితి సభ్యుడు బాచిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ జోగు వీరయ్య, నాయకులు శ్రీకాంత్, రాజు, జగన్, పాండు, రామచంద్రయ్య, నర్సింహ తదితరులు ఉన్నారు.

'జర్నలిస్టుపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి'

రంగారెడ్డి అర్బన్, జూలై 27: మొయినాబాద్ మండలం ముర్తూజగూడలో జర్నలిస్టు గణేష్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ నెల 26న వేకువ జామున కొందరు దుండగులు గణేష్ ఇంటిపై దాడి హేయమైన చర్య అన్నారు. దాడి వెనక కొందరి కుట్ర ఉందన్నారు. నిజాన్ని నిర్భయంగా వెలికితీస్తున్న జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నాయన్నారు. దాడి వెనుక సూత్రధారులెవరో పోలీసులు సమగ్ర విచారణ తెలుసుకొని శిక్షించాలని డిమాండ్ చేశారు. గణేష్, ఆయన కుటుంబ సభ్యులకు దుండగుల చేతిలో ప్రాణహాని ఉందని, ప్రభుత్వం తక్షణమే ఆ కుటుంబానికి రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నాయకుడు

షాద్‌నగర్ అర్బన్, జూలై 27: రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ సోషల్ సర్వీస్ అధ్యక్షుడు గడ్డమీది ప్రవీణ్ శనివారం బీజేపీలో చేరారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరగా ప్రవీణ్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కొందుర్గు మండలం రేగడి చిల్కమర్రికి చెందిన ప్రవీణ్‌తో పాటు మొదళ్లగూడెంకు చెందిన లింగం బీజేపీ చేరారు. పార్టీలో చేరి పనిచేసే వారికి పార్టీలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు.

క్రైం కార్నర్

ఉరేసుకొని సెక్యూరిటీ గార్డ్ ఆత్మహత్య

ఆదిభట్ల, జూలై 27: ఉరేసుకొని సెక్యూరిటీ గార్డ్ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదిభట్ల పరిధిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా జిల్లాకు చెందిన రవీందర్‌కుమార్(22) రెండు నెలల క్రితం వలసొచ్చి ఆదిభట్ల టీసీఎస్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తూ సంస్థకు చెందిన హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ నెల 25న డ్యూటీకి రాకపోవడంతో సెక్యూరిటీ గార్డ్ టీమ్ ఇన్‌చార్జి ముకేష్, హాస్టల్ సూపర్‌వైజర్ ఇద్దరు రాత్రి గది వద్దకు వెళ్లి చూశారు. లోపల గొళ్లెం పెట్టి ఉంది. బలవంతంగా తలుపురు తెరిచి చూడగా రవీందర్ కిటికీ ఊచలకు ఉరేసుకున్నాడు. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. రవీందర్ సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆర్థిక సమస్యల వల్లే ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చని సోదరుడు చెప్పాడని ఎస్సై తెలిపారు.

చేవెళ్ల ట్రాఫిక్ పోలీసులపై ఫిర్యాదు

చేవెళ్ల, జూలై 27: తన వ్యక్తిగత ప్రతిష్ఠకు భగం కల్గించిన చేవెళ్ల ట్రాఫిక్ సీఐ, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన మహేశ్ అనే వ్యక్తి శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ముడిమ్యాల్‌కు చెందిన బి.మహేశ్, జి.గాంధీ ఈ నెల 15న చేవెళ్లలో మద్యం తాగి కారులో ఇంటికి వెళ్తున్నారు. చేవెళ్లలో వారిని ట్రాఫిక్ పోలీసులు తనిఖీ చేశారు. బ్రీత్ అనలైజర్‌లో డ్రైవర్ మహేశ్‌కు 90 పాయింట్లు వచ్చింది. అదే సమయంలో తనకు ఫోన్ రావడంతో రోడ్డు పక్కకు వెళ్లి మాట్లాడుతుండగా సీఐ వెంకటేశం, సిబ్బంది శ్రీను, కేశవులు తనను కొట్టి బూతులు తిట్టారని, ఇది కొందరు వీడియో తీసి మాధ్యమాల్లో వైరల్ చేశారని మహేశ్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. తన ప్రతిష్ఠకు భగం కల్గించేలా వ్యవహరించిన ట్రాఫిక్ పోలీసులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అతడు కోరాడు. దీనిపై చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ స్పందిస్తూ.. మహేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

సంక్షిప్తంగా...

● **శంషాబాద్** : ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు శనివారం శంషాబాద్ లోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద కార్మికులకు భోజన పాకెట్లు పంపిణీ చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు అన్నెపు ప్రభు తల్లి నీలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని కార్మికులకు, వారి కుటుంబాలకు ఉచితంగా భోజనం, నీరు పంపిణీ చేసినట్టు నాయకుడు తెలిపారు.

● **ఆమనగల్లు** : కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి కేంద్ర మాజీ మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డీ సూదిని జైపాల్‌రెడ్డి పేరు పెట్టాలని దక్షిణ భారత ప్రజా హక్కుల, అభివృద్ధి ఐక్య వేదిక కన్వీనర్ డాక్టర్ విస్లావత్ జగన్ నాయక్ కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో క్రియాశీలక పాత్ర పోషించిన జైపాల్‌రెడ్డి సేవలను ప్రభుత్వం గుర్తించాలన్నారు. వెల్దండ మండలం కొత్త గేటు వద్ద ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్న జైపాల్‌రెడ్డి విగ్రహాన్ని నాయకులతో కలిసి జగన్ నాయక్ పరిశీలించారు. నిస్వార్థ రాజకీయాలకు జైపాల్‌రెడ్డి నిలువుటద్దం అన్నారు. కార్యక్రమంలో మాడ్గుల జంగయ్య, న్యాయవాదులు లక్ష్మణశర్మ, నరేశ్‌కుమార్, హర్యనాయక్, గురుమూర్తి, సాయిరెడ్డి, భూపతి రెడ్డి, తదితరులు ఉన్నారు.

● **కడ్తాల్:** ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని ప్యాక్స్ డైరెక్టర్ సేవ్యానాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్‌పతినాయక్, మాజీ సర్పంచ్ హంసమోత్యనాయక్, బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శంకర్‌నాయక్ అన్నారు. సీతారామ్‌నగర్ తండాకు బదిలీ అయిన గాన్గుమర్ల తండా పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌కు నూతన కార్యదర్శి రాఘవేందర్‌లకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల అభివృద్ధిలో కార్యదర్శుల పాత్ర కీలకం అన్నారు. కార్యక్రమంలో శంకర్, పాండు, భీమన్, రాజు, జగన్, శ్రీను, గణేశ్, హరిలాల్, మున్న, జయేందర్, మోత్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

● **కందుకూరు:** మండల మత్స్య పారిశ్రామిక సంఘం పూర్తిస్థాయి కమిటీని ఎన్నుకున్నట్లు సంఘం మండల అధ్యక్షుడు పి.లింగంముదిరాజ్ తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానంతరం మాట్లాడారు. ఉపాధ్యక్షులుగా పి.లక్ష్మణ్‌ముదిరాజ్, పి.రమేష్, ఢిల్లీ బాలకృష్ణ, ఎ.ప్రభాకర్, టి.శ్రావణ్‌కుమార్,జె. పాండు, ప్రధానకార్యదర్శి ఉదయ్‌కిరణ్, కార్యదర్శులు తాళ్ల నర్సింహ, నీలం శ్రీనివాస్, కోశాధికారి అంబటి కృష్ణ, సలహాదారులగా రాములు, బాబురావు, వెంకటేష్, కె. సత్తయ్య, ఆర్.కృష్ణయ్య, మెరుగు యాదయ్య, సభ్యులుగా ఎం.రాజు, ఎడ్ల రవీందర్, లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

● **కడ్తాల్:** అభాగ్యులకు జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉంటుందని ట్రస్ట్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్ అన్నారు. అనారోగ్యం, ప్రమాదవశాత్తు మృతిచెందిన పలువురి కుటుంబాలకు ట్రస్ట్ ద్వారా చేయూతనందించి ఆదుకుంటున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని గ్రామాల్లో ఆయన పర్యటించారు. సాలార్‌పూర్‌లో ఎల్లమ్మ, సోమ్మ, చంద్రు, కిషన్, సజి కుటుంబాలకు రూ.25వేలు అందజేశారు. అలాగే గోవిందాయిపల్లి తండాకు చెందిన నేనావత్ జగ్‌రామ్, ధర్మి, సభావట్ వాచ్య, నాజీ, పీక్లీ, బిక్కు కుటుంబాలను పరామర్శించి ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున సాయం చేశారు. కడ్తాలకు చెందిన మణెమ్మ కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల సాయం అందించారు. ఒకే రోజు 13 కుటుంబాలకు రూ.65వేలు సాయం అందించినట్లు దశరథ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో బాచిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వీరయ్య, సువాళి పంతూ, ప్రియరమేశ్, సాయిలు, చత్రునాయక్, లాయక్‌అలీ, నర్సింహ ఉన్నారు.

● **శంకర్‌పల్లి:** ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణానికి పాటు పడాలని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. తన కార్యాలయంలో వన మహోత్సవం, వీధి కుక్కల నిర్మూలకు బ్లూ క్రాస్ వారితో ఎంఓయూ, మహిళాశక్తి పథకం, సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తదితర వాటిపై సిబ్బంది, మెప్మా ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. వీధికుక్కల బెడద నివారణకు బ్లూ క్రాస్‌తో ఎంఓయూ చేసుకున్నట్లు చెప్పారు. వారు కుక్కలకు వ్యాక్సినేషన్ చేస్తారన్నారు. కుక్కలు కరిసినా రేబిస్ వ్యాధి రాదని ఆయన తెలిపారు. కుక్కలు పెరుగకుంగా నియంత్రిస్తామన్నారు.

● **ఆమనగల్లు:** ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తిమ్మరాశిపల్లిలో ఈ నెల 30న మెగా వైద్య శిబిరం నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, పీఆర్‌వో ఎం.పాషా తెలిపారు. క్లబ్ జోన్ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి సహకారంతో నిర్వహించే శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. శిబిరాన్ని తిమ్మరాశిపల్లి, సమీప గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.